

జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో

# మహిళకు స్థానం కల్పించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

జిల్లా అక్రిడేషన్ కమిటీలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని కుమురభీమ్ జిల్లా వార్త పత్రిక స్టాఫ్ రిపోర్టర్ గిరిజ జిల్లా కలెక్టర్ హరితను కోరారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026-28 గాను ఏర్పాటు చేసే నూతన జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో మహిళా కోట కింద సభ్యురాలిగా సమూచిత స్థానం కల్పించాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు  ఈ కమిటీలో మహిళలు ఎవరూ లేరని, ఇప్పటికి మూడు పర్యాయాలు అక్రిడిషన్ కార్డు తాను పొందడం జరిగిందన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ఐ అండ్ పి ఆర్ నిబంధనల ప్రకారం కమిటీ భేటీలో నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు స్టాఫ్ రిపోర్టర్ పేర్కొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**



వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయటం నిషేధమని, మైనర్ వాహనం నడిపి పట్టుబడిన సందర్భాల్లో వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేయబడుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం, నంబర్ ప్లేట్ దాచడం, తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, రాంగ్ సైడ్ పార్కింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, బాధ్యతారాహిత్యంగా ఓవర్ లోడెడ్ వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రత కొరకు జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు చేపడతామని తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని

# అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్

- సుమన్ బెయిల్‌ను అడ్డుకునే కుట్ర సుమన్ తో ములాఖాత్ అనంతరం మీడియా సమావేశం
- ప్రభుత్వ తీరుపై కొప్పుల ఈశ్వర్ తీవ్ర ఆరోపణలు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం మంటగలుస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ రాకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. క్యాతనపల్లి ఘటనలో కేసు నమోదు కాగా ప్రస్తుతం అదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బాల్క సుమన్, నాయకులను సోమవారం కలిసి మూలాఖాత్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చైర్మన్ ఎన్నిక పూర్తయ్యే వరకు సుమన్ ను జైలులోనే ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన మున్సిపల్ ఎన్నికలను వక్రీకరించేందుకు మంత్రి వివేక్ సహా కాంగ్రెస్ నాయకులు నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించిన సుమన్ తో పాటు బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారాని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహస్యం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దీనిపై న్యాయపోరాటం కొనసాగిస్తామని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. ఆయన వెంట శాసనసభ్యులు కోరుకంటి చందర్, తదితర నాయకులు పాల్గొన్నారు.




# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 24, ఫిబ్రవరి 2026


# రాష్ట్ర స్థాయి క్రీడల్లో మెరిసిన పోలీస్ క్రీడాకారులు

- పోలీస్ కమిషనర్ అభినందనలు
- ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తాం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



**మంచిర్యాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026 సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ గ్రౌండ్స్‌లో హోరాహోరీగా నిర్వహించబడిన క్రీడోత్సవాలు రెండు రోజుల క్రితం ముగిశాయి. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన పోలీస్

మిగతా 2లో..

# అక్రమంగా టేకు కర్ర దందా..!



## ❖ డిప్యూటీ రేంజర్ హైమావతి అవినీతి భాగోతం

## ❖ బయటపెట్టిన గ్రామస్తులు

**చింతలమనేపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



ఇంటి దొంగలను ఈశ్వరుడైన పట్టరు అని అంటారు ఇలాంటి సంఘటన కర్జవెళ్ళి అటవీ క్షేత్ర అధికారి పరిధిలో జరగడం కలకలం రేపింది. కంచే చేను మేసినట్లు అన్న సామెత ఈమె విషయంలో అక్షరాలా నిజమైంది. ప్రజల ముందు నీతిమంతురాలిగా నటిస్తూ, అడవిని కాపాడాల్సిన అధికారిణి అడవిని నరికేస్తూ అక్రమ సంపాదనకు తెరలేపింది. చింతలమనేపల్లి మండలం కర్జవెల్లి రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఒక మహిళా డిప్యూటీ రేంజర్ హైమవతి బాగోతం తాజాగా అంబఘట్ట గ్రామస్తుల సాహసంతో వెలుగులోకి వచ్చింది. 2లో..

# అక్రమంగా టేకు కర్ర దందా..!

(మొదటిపేజీ తరువాయి)

### అది నుండి వివాధ స్పదంగా డిప్యూటీ రేంజ్ అధికారిని పనితీరు:

గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు సదరు డిప్యూటీ రేంజర్ హేమవతి తన అధికార బలంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బయటకు చాలా సౌమ్యురాలిగా, విధి నిర్వహణలో కఠినంగా ఉన్నట్లు నటిస్తూనే, తెర వెనుక తన భర్త శివ కుమార్ ను బినామీగా పెట్టుకొని టేకు కలప అక్రమ రవాణాను సాగిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నా, తాజాగా గ్రామస్తులు పక్కా ఆధారాలతో పట్టుకోవడంతో ఆమె బండారం బయటపడింది.

### కర్ర లోడు తో రెడ్ హ్యాండెడ్ పట్టుబడిన ట్రాక్టర్:

పట్టపగలు లక్షల రూపాయల విలువ చేసే టేకు కర్రను అక్రమంగా తరలించడానికి రన్వెల్లి గ్రామానికి చెందిన రైతు విలాస్ కు ఫోన్ చేసి ట్రాక్టర్ తీసుకొని రావాలని శివకుమార్ కోరగా నేను రాను అనడంతో డిప్యూటీ రేంజర్ అధికారి హైమవతి ఫోన్ చేసి తొందరగా రండి ఏమైనా ఉంటే నేను చూసుకుంటాను అనడంతో వచ్చి అడవిలోని టేకు మోట్లని నింపుకొని అంబఘట్ట గ్రామం మీదుగా రన్వెల్లికి తరలిస్తుండగా, అంబఘట్ట గ్రామస్తులు అప్రమత్తమై దానిని అడ్డుకున్నారు. అధికారిణి అండదండలతోనే ఈ రవాణా జరుగుతోందని గుర్తించిన స్థానికులు, నిందితులను నిలదీశారు. అడవిని కాపాడాల్సిన వారే ఇలా అక్రమాలకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాక్షేత్రంలో అడ్డంగా దొరికిపోయిన ఈ అధికారిణిపై అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలని. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత గల వ్యక్తులే ఇలా బినామీల పేరుతో వ్యాపారం చేయడంపై స్థానిక ప్రజలు ఇదేం పనిఅని ముక్కున వేలు వేసుకుంటున్నారు.

### అటవీ క్షేత్ర అధికారి వివరణ:

ఫారెస్ట్ రేంజ్ అధికారి సుభాష్‌ను ఫోన్లో వివరణ కోరగా అంబఘట్ట గ్రామంలో ట్రాక్టర్ లో తరలిస్తున్న టేకు కటే దొరికిన విషయం వాస్తవమేనని ఇట్టి కర్రను స్వాధీనం చేసుకుని రవీంద్రనగర్ లోని రేంజ్ కార్యాలయానికి తరలించి డిప్యూటీ రేంజర్ హైమవతి, శివకుమార్, విలాస్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇట్టి విషయంలో పై అధికారులు నివేదిక పంపినట్లు తెలిపారు.

## బొగ్గు ఉత్పత్తిలో ఆర్.కె-న్యూటెక్ గని సరికొత్త రికార్డు

**- కార్మికుల సమష్టి కృషితోనే ఈ విజయం**

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

నస్పూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

ఆర్.కె-న్యూటెక్ ఉద్యోగులు పట్టుదలతో విధులు నిర్వహిస్తూ కంపెనీకే ఆదర్శంగా నిలుస్తున్నారని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2025-26 వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 40 రోజుల ముందుగానే చేరుకున్న నేపథ్యంలో సోమవారం ఆర్.కె-న్యూటెక్ గని వద్ద అభినందన సభ నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన తొలి భూగర్భ గనిగా ఆర్.కెన్యూటెక్ నిలిచిందని ఆయన వెల్లడించారు. రికార్డు స్థాయిలో ఉత్పత్తి సాధించినందుకు సింగరేణి డైరెక్టర్ (పీపీ) కె. వెంకటేశ్వర్లు ఉద్యోగులను అభినందించారని జీఎం తెలిపారు. గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల కృషితోనే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో అధికోత్పత్తికి సహకరించాలని కోరారు. ఆర్కేన్యూటెక్ గనిలో కొత్త సీమ్ ద్వారా బొగ్గు నిల్వలు వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులు నైపుణ్యంతో విధులు నిర్వహించి తమవంతు తోడ్పాటు అందించాలని కోరారు. కార్మికులు గైర్హాజరు కాకుండా విధులకు రావాలని సూచించారు. సంస్థ ప్రగతిలో ఉద్యోగులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్.కె బాజీసైదా, గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్, గని మేనేజర్ కురపాటి శ్రీనివాసు, గ్రూపు ఇంజినీర్ ఏ. మోహన్, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, సర్వే అధికారి వీపీ రావు, ఇంజినీర్ కృష్ణ పాల్గొన్నారు.



## పొన్నారం గ్రామ పంచాయతీలో మండల పంచాయతీ అధికారి తనిఖీ

మందమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



మందమర్రి మండలంలోని పొన్నారం గ్రామ పంచాయతీని సోమవారం మండల పంచాయతీ అధికారి ఎం. సత్యనారాయణ సందర్శించి పలు పరిపాలన అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్వహణ, ఆదాయ వనరులు, పారిశుధ్య కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేసి ఈ నెల 25022026లోపు అన్ని గ్రామ పంచాయతీల్లో 100 శాతం వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్సులను సంబంధిత దుకాణ యజమానులతో చర్చించి వెంటనే రెన్యువల్ చేయించాలని సూచించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆర్.టి.ఐ దరఖాస్తులకు సంబంధించి అభ్యర్థులు కోరిన సమాచారాన్ని వెంటనే అందజేసి, ఒక ప్రతిని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల లోపు హాజరు నమోదు చేసి, డి.ఎస్.ఆర్ నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త లేకుండా పరిశుభ్ర వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి 100 శాతం మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్శనలో పొన్నారం సర్పంచ్ మధు, హరీష్, పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ క్షేత్ర స్థాయి సహాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి క్రీడల్లో మెరిసిన పోలీస్ క్రీడాకారులు

(మొదటిపేజీ తరువాయి)

క్రీడాకారులను సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అభినందించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై, పతకాలు సాధించిన క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు క్రీడాకారులను అభినందించారు. క్రీడలకు సమయం కేటాయించే పోలీస్ అధికారులకు పూర్తి స్థాయి సహకారం అందించబడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి శాఖకు మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విజయం సాధించడం క్రమశిక్షణ, సమన్వయం, నిరంతర సాధన వల్లే సాధ్యమని పేర్కొంటూ, శాఖ తరఫున క్రీడాకారులకు అన్ని విధాల మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని, విధి నిర్వహణలో క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని తెలిపారు. 4వ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ మీట్ 2026లో కాళేశ్వరం జోన్ నుంచి 150 మంది పాల్గొనగా, అందులో 30 మంది క్రీడాకారులు 23 పతకాలు సాధించారు. అందులో బం పతకాలు 7, వెండి పతకాలు 8, కాంస్య పతకాలు 8 ఉన్నాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 15 మంది క్రీడాకారులు, ములుగు జిల్లా నుండి 5 మంది, కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 6 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి 4 మంది పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కె.శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ కృష్ణ, ఆర్ఐలు శేఖర్, పెద్దన్న, సీసీ హరీష్ తదితరులు పాల్గొన్నారు

## బెల్లంపల్లిలో మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో నిరసన

**- నాగర్ కర్నూల్ ఘటనలో పసిపాప మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

బెల్లంపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెరలో మండలంలో కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప మృతి చెందిన ఘటనపై బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్ నాయకత్వంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక రాజనర్సు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెరలో మండల కేంద్రంలో జరిగిన మల్లన్న జాతర సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లిన బీసీకి చెందిన రజక కుటుంబం, ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళపై అగ్రకుల దురహంకారంతో దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన ఘటన అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ఆధారిత వివక్ష కారణంగా పసిపాప ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన తుకారాం రెడ్డి, మధుకర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి లను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కుల ఆధారిత హింసకు స్థానం లేదని ప్రభుత్వం స్పష్టమైన సందేశం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు కోళ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్, జిల్లా కార్యదర్శి ఇడిగిరాల ప్రసాద్, పట్టణ గౌరవ అధ్యక్షుడు ఆరేపెల్లి రమేష్, యువజన నాయకులు గద్దల కుమార్, సీనియర్ నాయకులు పల్లె రమేష్, నాథరి భీమయ్య, ఎరుకల సంఘం జిల్లా నాయకుడు ఉండాడి మల్లయ్య, పట్టణ నాయకుడు ఆరేపెల్లి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

## రజక కుటుంబంపై దాడి చేసిన రెడ్డి అగ్రకుల దురహంకారులను అరెస్టు చేయాలి..

మంచిర్యాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



సోమవారం రోజు మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర శ్రీ మల్లికార్జున స్వామి జాతరలో రజక కుటుంబాన్ని అతి దారుణంగా కొట్టి రెండు నెలల పాపను కాలితో తన్ని హత్య చేసిన హంతకులైన ఎనిమిది మంది రెడ్డి కులస్తులపైన తక్షణమే హత్య కేసు పెట్టడమే కాకుండా తుకారం రెడ్డిని సర్పంచ్ పదవి నుండి తొలగించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జేబుకు నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా 8 మంది రెడ్ల పై హత్య కేసు పెట్టే వరకు ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జనాభాలో కేవలం ఏడు శాతం ఉన్న అగ్రవర్ణాలు, ఈ రాష్ట్ర జనాభాలో 56 ఉన్న బీసీల ఆగ్రహానికి కొట్టుకపోక తప్పదని అలాగే దాడి చేసిన రెడ్ల పై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తూ మృతి చెందిన చంద్రకళ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, గజెల్లి వెంకటయ్య, తెలంగాణ రజక రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి చంద్రమోళి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తంగళ్ళపల్లి బాపు, షాకపూరి భీమ్సేన్, రాజన్న చారి, వేముల అశోక్, కీర్తి బిక్షపతి, కీర్తి రవి, అడ్వకేట్ కర్రే లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

చింతలమనేపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

మండలంలోని గూడెం గ్రామ పరిధిలో దశాబ్దాలుగా కొనసాగుతున్న లోవోల్టేజ్ సమస్యలకు పరిష్కారం లభించనుంది. గూడెం వద్ద 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గూడెం సహా పరిసర 23 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శిలాఫలకం ఆవిష్కరించగా, భూకేటాయింపుల సమస్యలు పరిష్కారమవడంతో పనులు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యమన్నారు. బెజ్జూర్-అహేరీ బస్సు సర్వీసుల పునఃప్రారంభంతో ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడిందని తెలిపారు. హ్యామ్ పథకం కింద గూడెం-బాబాసాగర్ రహదారి పనులు త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైతే అదనపు విద్యుత్ స్తంభాలు, లైన్ల కోసం అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## జీవో 25ను వెంటనే రద్దు చేయాలి

### - ఉపాధ్యాయుల నిరసన

**లక్ష్మణచాంద, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం భోజన విరామ సమయంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు జీవో 25కు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ మాట్లాడుతూ.. రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించిన జీవో 25 వల్ల ఉపాధ్యాయుల సంఖ్య తగ్గి, నిరుద్యోగ సమస్య పెరగడమే కాకుండా విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిని వెంటనే రద్దు చేసి ప్రాథమిక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాల్సిన ప్రభుత్వం, జీవో 25 పేరుతో పాఠశాలకు కేవలం ఒక్కరినే కేటాయించడం దారుణమని వాపోయారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు చింతా మోహన్, టీఎస్ యూటీఎఫ్ మండల బాధ్యులు సిహెచ్ సాయన్న, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీలో చేరిన మామడ మాజీ సర్పంచ్ యాదవ రావ్

**నేరడిగొండ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

మండలంలోని మామడ మాజీ సర్పంచ్ హర్కు యాదవ రావ్ తన అనుచరులతో కలిసి సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసుల చిరకాల స్వప్నమైన మావ నాటే మావ రాజ్ (మా ఊరిలో మా పాలన)ను కేసీఆర్ ప్రభుత్వం సాకారం చేసిందని గుర్తుచేశారు. కొమురం భీమ్ మ్యూజియాన్ని ఏర్పాటు చేసి ఆదివాసుల ఆరాధ్య దైవానికి సముచిత గౌరవం కల్పించారన్నారు. మాజీ సర్పంచ్ యాదవ రావుతో పాటు హర్కు రాందాస్, మాడావి బాపురావ్, సుదర్శన్, హేమంత్ రావ్, రాములు, మెస్రం జంగు, జుగదిరావ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, పండరీ, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభం

**జైనూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నూతన సర్పంచులకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 23 నుండి 27 వరకు సర్పంచుల విధివిధానాలు, బాధ్యతలపై ఇచ్చే ఈ శిక్షణ కార్యక్రమానికి జైనూర్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీల నూతన సర్పంచులు హాజరయ్యారు. శిక్షణకు వెళ్లిన వారిలో జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, ఆశపెల్లి రామ్ నాయక్, తండా సర్పంచ్ రాథోడ్ రాందాస్, జెండగూడ సర్పంచ్ ఉయిక చందన్ షావ్, మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరరావు, గూడమామిడి సర్పంచ్ కుమ్ర యశోద కేశవ్, పవర్ గూడ సర్పంచ్ తొడసం రాజేందర్‌తో పాటు పలు గ్రామపంచాయతీల నూతన సర్పంచులు ఉన్నారు.



# ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### * మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి నుండి దరఖాస్తులు స్వీకరించారు. లక్షెట్టిపేట మండలం గోదావరి రోడ్డు ప్రాంతానికి చెందిన మామిడి రాజశేఖర్ నిరుపేద దివ్యాంగుడిని అయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండలం తీగల్ పహాడ్ గ్రామానికి చెందిన సంకు విజయ పద్మ, విష్ణు స్వరూప్‌లు తమ గోదాములో ధాన్యం నిల్వ చేసినందుకు గాను కిరాయి సొమ్ము ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన రైతులు తమకు 2007 సంవత్సరంలో ఇచ్చిన భూమిలో తాము సాగు చేసుకుంటున్నామని, డిజిటల్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఎన్ రెడ్డి చిన్న రాజయ్య తనకు గల భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఇట్టి పట్టాను రద్దుచేసి తిరిగి తనకు భూమిని అప్పగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం గంగారం నగర్ బస్తీకి చెందిన చిప్ప హరీష్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వ్యాపారం కొనసాగిస్తున్న విషయంపై వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలోని బి సి కాలనీలో జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమంగా చేపట్టిన పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కష్టాలు రాకుండా ముందు జాగ్రత్త

### - పైపులైన్లు, చేతిపంపుల మరమ్మతు

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



మండలంలోని పలు గ్రామాల్లో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సర్పంచులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామాల్లోని చేతిపంపులు, మిషన్ భగీరథ పైప్‌లైన్లకు యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయించారు. ముఖ్యంగా కంకెట, జామ్, సారంగాపూర్, కౌట్ల(బి) గ్రామాల సర్పంచులు తమ పరిధిలోని చేతిపంపులు, బోర్లు, ట్యాంకుల నుండి ఇళ్లకు వెళ్లే పైప్‌లైన్ల లీకేజీలను సరిచేయించారు. వేసవిలో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ ముందస్తు పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామ్ సర్పంచ్ కరిపె రవళి విలాస్, నాయకులు బల్లురి అజయ్, కోనేరు భూమన్న, సిద్ధికార్ సాహెబ్ రావు, మల్టీపర్పస్ వర్కర్స్, గ్రామ యువత పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ హరితకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## సన్నకారు రైతులను ఆదుకోవాలి...

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:**

దహెగాం మండలం కొంచెల్లి గ్రామ శివారులోని జలాల్ల పట్టా వ్యవసాయ భూముల్లోని సన్నకారు రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ హరితను కోరారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొంచెల్లి శివారులోని జలాల్ల వ్యవసాయ ప్రాంతంలో సాగు భూములు ఉన్నాయన్నారు. ఈ భూములకు ఆనుకొని మాత్తిడి వాగు ప్రవహిస్తోందన్నారు. ఈ వాగులో ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం కోసం కట్ట కట్టి అసంపూర్తిగా వదిలేశారని, దీంతో వాగు నుంచి వచ్చే నీటి ప్రవాహంతో 1500 ఎకరాల వ్యవసాయ భూమి తుడిచిపెట్టుకొని పొంతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూముల్లోని సన్నకారు రైతులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరినట్లు రైతులు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రవితేజ గౌడ్, నారిమెరా, శ్రీనివాస్, రాజగౌడ్,నారాయణ, శంకర్, సాంబయ్య తదితరులు ఉన్నారు.

## బ్రిడ్జి పైనుంచి బోల్తా పడిన కారు

### - పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలు

**బజార్‌హత్నూర్, ప్రభాతవార్త:**



మండలంలోని పిప్పిరి గ్రామ సమీపంలో బ్రిడ్జి పైనుంచి కారు బోల్తా పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బజార్‌హత్నూర్ నుండి ఇచ్చోడ వైపు కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గులాబ్ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గంజాయి పట్టివేత

**కెరమెరి,ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

మండలంలోని సావర్ ఖేడ గ్రామ శివారులో సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా గంజాయి అక్రమ రవాణా కేసులో ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకున్నట్లు కెరమెరి ఎస్ఐ మధుకర్ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి సావర్ ఖేడ గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా సంచరిస్తున్న సరోజిత్ మండల్ అనే వ్యక్తిని గుర్తించి విచారించారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి 210 గ్రాముల గంజాయి లభ్యమైంది.పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5,250 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.గంజాయి విక్రయం, కొనుగోలు లేదా వినియోగంలో పాల్గొన్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు

**- కలెక్టర్ కె. హరిత**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

ప్రజావాణి కార్యక్రమములో అర్జీల నుంచి అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు, దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్.డి.ఒ లోకేశ్వర రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్ నగర్ కు చెందిన బోయని నాగేష్ తన తండ్రి మరణ ధృవీకరణ జారీకి దరఖాస్తు సమర్పించారు. జైనూర్ మండలం పార గ్రామానికి చెందిన సిద్దూరావు తన వ్యవసాయ చేనులో బోరి మంజూరూ చేయాలని, రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ఎల్కరి పద్మ తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరూ చేయాలని, కౌటాల మండలం తాటి నగర్ గ్రామానికి చెందిన దుర్గం శరత్ చంద్ర తమ గ్రామములో బుద్ధని మందిరం నిర్మాణానికి అక్రమంగా చందాలు వసూలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని, ఆసిఫాబాద్ పట్టనం జన్కాపూర్ గ్రామానికి చెందిన అనసూర్య తనకు నర్సింగ్ కాలేజ్‌లో అవుట్ సోర్సింగ్ క్రింద ఉపాది కల్పించాలని, చింతలమానేపల్లి మండలం చెందిన రైతు తనకు కర్జెల్లి గ్రామ శివారులో గల భూమిని తనకు తెలియకుండ ఇతరులు పట్టా చేసుకున్నారని చర్యలు తీసుకోవాలని పలువురు పలు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమములో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ కె. హరిత



మోటర్‌ను మరమ్మత్తులు చేయించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్

## ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతరం కృషి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతరం కృషి చేస్తామని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని 17వ వార్డు లో వాటర్ మోటర్ చెడిపోవడం వల్ల కాలనీవాసులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు దృష్టికి తీసుకురాగా వైస్ చైర్మన్ స్పందించి తన స్వంత నిధులతో ఆ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ పురపాలక సంఘం అభివృద్ధితోపాటు 17 వార్డు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపెడతానని తెలిపారు. వాటర్ మోటర్ ద్వారా దాదాపు 100 కుటుంబాల నీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, సయ్యద్ జావిద్, షబ్బీర్, కాలనీవాసులు హఫీజ్, మాజిద్, ఫైజాన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న శంకరపల్లి గ్రామస్తులు

## మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**మందమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మందమర్రి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మందమర్రి మండలం శంకరపల్లి గ్రామ పంచాయతీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వార్డు సభ్యులు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో రైతులు పంట కోత అనంతరం ధాన్యం విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా శంకరపల్లి గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణంలోకి చుట్టుపక్కల చెదల నుండి పాములు, ఇతర ప్రమాదకర జీవులు ప్రవేశించే అవకాశముండడంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టగలరని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాలు స్వీకరించిన ఎంపీడీవో రాజేశ్వర్ సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మండలంలో అభివృద్ధి పనులపై ఎంపీడీవో సమీక్ష

**మందమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మందమర్రి మండలంలో సోమవారం ఉదయం ఎంపీడీవో రాజేశ్వర్ వెంకటాపుర, మామిడిగట్టు, పొన్నారం గ్రామ పంచాయతీలను సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, పారిశుధ్య కార్యక్రమాలు, నర్సరీ పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేసి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.



## స్కూల్ పిల్లలకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత

**జన్నారం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని ధర్మారం యుపిఎస్ స్కూల్‌లో పిల్లలు క్రీడా రంగంలో ముందుకు వెళ్లాలని, చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని ధర్మారం గ్రామ గల్ఫ్ స్వచ్ఛంద సేవా ఫౌండేషన్ వారు పిల్లలకు స్పోర్ట్స్ కిట్‌ను అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంబడి సత్తన్న తెలిపారు. అదేవిధంగా గత 48 సంవత్సరాలుగా పాఠశాలలో పి.టి.డబ్ల్యూ అటెండర్‌గా సేవలు అందిస్తున్న గొల్లపల్లి నారాయణ, అలాగే పిల్లలకు మంచి పౌష్టికరమైన భోజనాలు పెడుతూ సేవలందిస్తున్న మగ్గిడి లచ్చక్క, చిట్యాల విజయ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మారం గల్ఫ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ పిల్లలంతా మంచిగా చదువుకోవాలని, ఆటలలో క్రీడలలో కూడా ముందుండాలని, చదువు కున్న బడికి తమ వంతు సహాయాన్ని అందివ్వడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది అందరూ కలిసి గల్ఫ్ స్వచంధ పౌండేషన్ ధర్మారం సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు రాచకొండ రాజేష్, నమిలకొండ కాంతారావు, చిట్యాల రాజు, తడకపెల్లి వరుణ్,గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, పాఠశాల సిబ్బంది గల్ఫ్ స్వచ్ఛంద సేవా ఫౌండేషన్ ధర్మారం వారిని అభినందించారు.





స్కూల్ పిల్లలకు స్పోర్ట్స్ కిట్ అందచేసిన దృశ్యం



## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**- జైనూర్ సిఐ రమేష్**

**జైనూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జైనూర్ సిఐ రమేష్ హెచ్చరించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జైనూర్ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో అలైవ్ అరయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసిన సిఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని సూచించారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని పలు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే యజమానులకు అప్పగిస్తామని, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ ఎస్ఐలు రవికుమార్, రామకృష్ణ, గంగన్నతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితో రాణించాలి: సర్పంచ్ బానోత్ కావేరి

**నార్నూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో హిరాలాల్ క్రికెట్ లీగ్ లేదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ బాణోత్ కావేరి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉత్తమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాథోడ్ దత్తారం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్ ఆడే, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవరావు, బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి, ఉపసర్పంచ్ మహమ్మద్ ఖురేషి, జాదవ్ బాలాజీ, వార్డు సభ్యులు మహేందర్, బి.శ్రావణ్, జాదవ్ శ్రావణ్, ఏఎంసీ డైరెక్టర్ జాదవ్ కైలాస్, సయ్యద్ ఖాసిం, గుంజే శీను, రాథోడ్ అమరేందర్, గుంజ చిన్నయ్య, రాథోడ్ సూరజ్, రాథోడ్ ప్రవీణ్, అక్షయ్, చేతన్, కార్తీక్, రాథోడ్ దినేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న యువకులు

## ఇళ్ల మధ్య విద్యుత్ లైన్ తొలగించాలి

### - ప్రజావాణిలో స్వేచ్ఛ యువజన సంఘం వినతి

**వేమనపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

గొర్రెపల్లి గ్రామం గుండా వెళుతున్న విద్యుత్ లైన్ తొలగించాలని స్వేచ్ఛ యువజన సంఘం నాయకులు సోమవారం ప్రజావాణిలో ఎంపిడిఓ కుమారస్వామికి వినతి పత్రం సమర్పించారు. గొర్లపల్లి గ్రామంలో ఇండ్ల పైన నుండి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లడం వల్ల ప్రజలకు ప్రమాదాలు కలిగిస్తున్నాయని గతంలో గడ్డివాములు కాలిపోవడం దారితీసిందని అలాగే ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉంది కాబట్టి గ్రామస్తులకు నష్టం కలగకుండా ఉండడానికి గ్రామం నుండి విద్యుత్ లైన్ గ్రామం బయటకు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ యువజన సంఘం అధ్యక్షులు గురుండ్ల సురేష్, నాయకులు అరిగల మహేష్, నిదునూరి సంజీవ్, అరిగెల లవిత్, నికూరి మహేష్ పాల్గొన్నారు.



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లతో మాట్లాడి, వైద్య సేవలు ఎలా అందుతున్నాయో, ఎలాంటి సమస్యలు ఉన్నాయని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన సౌకర్యాలు, మందులు సమృద్ధిగా అందుతున్నాయా అని విచారించారు. అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది కొరత, పరికరాల అవసరం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు హామీ ఇచ్చారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన మద్దతు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నర్సయ్య, కౌన్సిలర్లు, స్వరంచులు, వార్డు మెంబర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**దండేపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన గంధం రాజమ్మ ఆదివారం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ముత్యంపేట గ్రామ సర్పంచ్ కుడిమేత తిరుపతి, ఉప సర్పంచ్ ఎండి ఫయాజ్, గ్రామ పెద్దలు ముత్తే బాపు, తోట రమణయ్యలు సోమవారం మృతురాలి నివాసాన్ని సందర్శించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలి కుమారుడైన గంధం సురేష్‌కు రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



### జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు

# నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

నిరుపేద లబ్ధిదారులకు, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం క్రమ మార్గంలో పంపిణీ చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య తో కలిసి విజిలెన్స్ కమిటీ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం ను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. 2026 జనవరి నెలలో 2 లక్షల 54 వేల 21 రేషన్ కార్డులలో 7 లక్షల 52,492 యూనిట్లకు గాను 96.30 శాతంతో 4 వేల 313 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. 100 శాతం రాయితీతో రేషన్ బియ్యం అందించడం జరుగుతుందని, రేషన్ డీలర్లు అర్హత గల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాలని, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తమ పరిధిలోని రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తారని, రేషన్ డీలర్లు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ 1955, 6 ఎ సెక్షన్ క్రింద 13 కేసులు నమోదు చేయడం జరిగిందని, జిల్లాలో వివిధ కేటగిరీల క్రింద మొత్తం 423 చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 969 అంగన్వాడీ కేంద్రాలకు 40 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకం కింద జిల్లాలోని 988 పాఠశాలలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్య అభ్యసిస్తున్న 40 వేల 759 మంది విద్యార్థుల కొరకు 80 మెట్లు ధాన్యం పంపిణీ చేయడం జరుగుతుందని, 112 సంక్షేమ సంస్థలు, వసతి గృహాలకు 320 మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని, రేషన్ బియ్యం తప్పుదారి పట్టకుండా పర్యవేక్షించాలని, రేషన్ బియ్యం దుర్వినియోగపరచిన లబ్ధిదారుల రేషన్ కార్డులు రద్దు చేయబడతాయని తెలిపారు. రేషన్ కార్డులలో చనిపోయిన వారి వివరాలు తొలగించాలని, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమ పితామహుడికి ఘన నివాళులు

### సాహసమే ఊపిరి - సేవే పరమావధి సందేశంతో కార్యక్రమం

**మందమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మందమర్రిలోని సింగరేణి హై స్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బేడెన్ పావెల్ జయంతి సందర్భంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఏరియా ఎస్ఓటు జీఎం జీ.ఎల్. ప్రసాద్, డివైపీఎం మహమ్మద్ ఆసిఫ్ లార్డ్ బేడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వమత సమ్మేళన ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం జీ.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న లార్డ్ బేడెన్ పావెల్ జయంతిని ప్రపంచ ఆలోచనా దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. సాహసమే ఊపిరిగా, సేవే పరమావధిగా ప్రపంచాన్ని మారుద్దాం అనే సందేశాన్ని ఆయన ముందుకు తెచ్చారని గుర్తు చేశారు. పిల్లలలో అపారమైన శక్తి ఉందని గ్రహించిన బేడెన్ పావెల్, చిన్న వయసు నుంచే దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని విశ్వసించి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమాన్ని స్థాపించారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, సేవాతత్పరత వంటి లక్షణాలను అలవరచుకోవడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం, స్కౌట్ మాస్టర్ శక్తి కుమార్, గైడ్ మాస్టర్ కల్పలత, ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ

### - సీఐ నవీన్

**జైపూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

వాహన చోదకులు రోడ్ భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని జైపూర్ సీఐ నవీన్ కుమార్ అన్నారు. అరైవ్ అలైవ్ రహదారి భద్రతా రెండవ ఫేజ్‌లో భాగంగా సోమవారం చెన్నూర్‌గోదావరి ఖని,రోడ్ క్రాస్ వద్ద భారీ వాహన డ్రైవర్లకు, ద్విచక్ర వాహన దారులకు రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల పాటింపు, క్రమశిక్షణ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాల కారణంగా సంభవించే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, డ్రైవర్లలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యంగా లైన్ క్రమశిక్షణలో భాగంగా భారీ, నెమ్మదిగా నడిచే వాహనాలు ఎల్లప్పుడూ రహదారికి ఎడమ వైపు లైన్‌లోనే ప్రయాణించాలన్నారు. లేన్‌లను క్రమబద్ధంగా పాటించడం ద్వారా ట్రాఫిక్ సాఫీగా సాగడమే కాకుండా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఓవర్‌టేకింగ్ నిబంధనలు.. వాహనాలను అధిగమించేటప్పుడు కేవలం కుడి వైపు నుండి మాత్రమే ఓవర్‌టేకింగ్ చేయాలని, ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం నిబంధనలకు విరుద్ధం మాత్రమే కాకుండా అత్యంత ప్రమాదకరమన్నారు. ముందున్న వాహనాన్ని దాటే ముందు తగినంత దూరం, భద్రతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను, ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని డ్రైవర్లకు వివరించారు. పోలీసులు భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ, రహదారులపై భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.



భారీ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ నవీన్




మట్టి పాత్రలను తయారుచేస్తున్న విద్యార్థులు



కార్యక్రమంలో హాజరైన విద్యార్థులు

### జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా

# మట్టి పాత్రల తయారీ వర్క్‌షాప్

- విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందింపు - ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా మట్టి పాత్రల వినియోగం అవసరం

- జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ కటకం మధుకర్

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త**

జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వేంపల్లి మండలంలోని సిర్పూర్ (టి)లో మట్టి పాత్రల తయారీపై సోమవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ కటకం మధుకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వంటి పదార్థాల అధిక వినియోగం వలన పర్యావరణ కాలుష్యం పెరిగి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి, పర్యావరణ పరిరక్షణకు మట్టి పాత్రల వినియోగం ఉత్తమ ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రకృతి స్నేహపూర్వక జీవన శైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ అట్కాపురి శ్రావణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి పాత్రల తయారీపై ప్రాయోగిక శిక్షణ అందించారు. మట్టి ముద్దను చక్రంపై ఎలా ఆకారంలోకి తేవాలి, దాన్ని ఎలా శుభ్రంగా తయారు చేయాలి వంటి అంశాలను ప్రదర్శన ద్వారా వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని స్వయంగా మట్టి పాత్రలను తయారు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, లక్ష్మీనారాయణ, ఓం ప్రకాష్, శాంతి కుమార్, శ్రీనివాస్, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇటువంటి శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకతతో పాటు పర్యావరణ బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వర్క్‌షాప్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం మరియు పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించినదిగా నిర్వాహకులు పేర్కొన్నారు.




తయారు చేసిన మట్టి పాత్రలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

## రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలో వెండి పతకం సాధించిన విద్యార్థిని హర్షిత

**తాండూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**




రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలలో తాండూర్ మండలం అచ్చులాపూర్ జెడ్పి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని చౌల్ల హర్షిత వెండి పతకం, రూ.15 వేలు ప్రైజ్ మనీ సాధించిందని పాఠశాల పిడి సాంబమూర్తి తెలిపారు. ఈనెల 21 నుండి 23 తేది వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం లో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలలో హర్షిత ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించిందన్నారు. విద్యార్థిని హర్షితను ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఏపిపిసి చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- రోడ్డు భద్రతపై ప్రత్యేక డ్రైవ్



**కెరమెరి, ప్రభాతవార్త:**

వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడే విధంగా బాధ్యతతో ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్ ఐ ఎన్ మధుకర్ అన్నారు సోమవారం మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలోని సాకడలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెరమెరి ఎస్సై మధుకర్ వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కల్పించారు.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వేసుకోవాలి అనే సూచనలు చేశారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా డ్రైవ్ చేయడం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వాడటం వంటి అనేక ట్రాఫిక్ నియమ ఉల్లంఘనల వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరంగా వాహనదారులకు తెలియజేశారు. సేఫ్టీ ఫస్ట్ అరైవ్ అలైవ్ అనే సందేశంతో వాహనదారులు తమ ప్రాణాలను మాత్రమే కాక, ఇతరుల ప్రాణాలను కాపాడే విధంగా బాధ్యతతో ట్రాఫిక్ నియమాలను పాటించాలని కెరమెరి పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తుందన్నారు.

## త్రాగునీటి సరఫరాలో అంతరాయం

- మిషన్ భగీరథ ఈఈ రాకేష్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:**

మిషన్ భగీరథ పంప్ హౌస్ మోటార్లకు అత్యవసర మరమ్మత్తుల దృష్ట్యా త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని మిషన్ భగీరథ ఈఈ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మాణిక్‌గూడ ఎడిఏ వద్ద ఉన్న 115 ఎంఎల్డి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ లోని మోటార్లకు అత్యవసర మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. వేసవి కాలం పురస్కరించుకొని ముందస్తు సన్నద్ధతలో భాగంగా పంప్ సెట్లలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, సిర్పూర్ (టి) నియోజకవర్గాలు, బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు ఈ నెల 26 రాత్రి 11 గంటల వరకు త్రాగునీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. మరమ్మతు పనులు పూర్తి అయిన వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించడం జరుగుతుందని, సంబంధిత ప్రాంతాల ప్రజలు అవసరమైనంత మేర ముందుగా త్రాగునీటిని నిల్వ చేసుకొని, సహకరించాలని తెలిపారు.

## విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

★ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. సోమవారం రోజు లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పలు విద్యార్థులు నృత్యం చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల విషయంలో తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ముందుగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేని శాలువాతో, గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నర్సయ్య, వైస్ చైర్మన్ రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, జిల్లా నాయకులు పూర్ణచందర్ రావు, చెల్లా నాగభూషణం, కౌన్సిలర్లు రాయలింగు, రాజు, తోట సువర్ణ రమేష్, స్వరంచులు, వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఓపెన్ కరాటే అండ్ కుంగ్‌ఫులో గోల్డ్ మెడల్స్ సాధించిన బెల్లంపల్లి విద్యార్థులు

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

ఇటీవల నిర్వహించిన 9వ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కరాటే అండ్ కుంగ్ ఫు ఛాంపియన్‌షిప్-2026 పోటీలలో స్థానిక అభ్యాస పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాలలో పాల్గొన్న విద్యార్థులు మొత్తం 23 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, 1 బ్రాంజ్ మెడల్ సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను అభ్యాస స్కూల్ బెల్లంపల్లి కైవసం చేసుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాస్టర్ మల్లెపల్లి జితేందర్, మేనేజర్లు మల్లెపల్లి సాయి ప్రసన్న, గడిపెల్లి ప్రవళిక, ప్రిన్సిపాల్ నస్రీన్, పిటి టీచర్ సంధ్య పాల్గొన్నారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నస్రీన్ మాట్లాడుతూ కరాటే ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక పరిపక్వత పెంపొందుతాయని, క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ భావి భారత పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు. కరాటే శిక్షణ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు, చదువుతో పాటు బహుముఖ ప్రజ్ఞను అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు.

## మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:**

జిల్లాలోని మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్యలతో కలిసి తహసిల్దార్లు, అటవీ శాఖ అధికారులు, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో కంపెనీ, టి ఫైబర్ ప్రతినిధులతో సెల్ టవర్ల ఏర్పాటు, ఇంటర్నెట్ సౌకర్యాల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెల్ టవర్ల నిర్మాణాలు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఎయిర్ టెల్, జియో సంస్థలు టవర్ల నిర్మాణాలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పనపై అవసరమైన స్థలం గుర్తింపు, పాలన పరమైన అనుమతులు త్వరగా పొందాలని తెలిపారు. టవర్ల నిర్మాణాల ద్వారా మారుమూల గ్రామాలకు సెల్ సిగ్నల్స్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, అటవీ అధికారులు, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో, టి ఫైబర్ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మా బంగారం ఎప్పుడిస్తారు..?

**బ్యాంకు అధికారులను నిలదీసిన బాధితులు - ఎస్‌బిఐ బ్యాంక్ 2 ముందు బాధితుల ఆందోళన**



చెన్నూరు ఎస్‌బిఐ 2 ముందు ఆందోళన చేస్తున్న బాధిత ఖాతాదారులు



**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్బీఐ బ్యాంకు 2 ముందు ఖాతాదారుల ఆందోళన చేపట్టారు. ఏడు నెలల క్రితం బ్యాంకులో ఉన్న బంగారాన్ని అదే బ్యాంకులో పనిచేసే ఉద్యోగులు దోపిడీ చేసిన విషయం విదితమే, ఈ సందర్భంగా బాధిత ఖాతాదారులు మాట్లాడుతూ గత ఏడు నెలల క్రితం చెన్నూర్ రెండవ బ్రాంచ్‌లో మేము దాచుకొన్న కోట్లాది రూపాయల నగదుతో పాటు, బంగారు ఆభరణాలు అదే బ్యాంకులో పనిచేసే ఉద్యోగులు చోరికి పాల్పడ్డారని, పోలీసులు వేగవంతంగా విచారణ చేసి కొద్దిరోజుల్లోనే నిందితుల వద్ద నుంచి నగదు, బంగారాన్ని రికవరీ చేసి కోర్టుకు అప్పగించినప్పటికీ ఇప్పటి వరకు మాకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. కోర్టు నుంచి రికవరీ అయిన బంగారం 7 నెలలు గడుస్తున్నా బ్యాంక్ అధికారులు స్పందించక పోవడంలో వారి ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. బ్యాంక్ అధికారులు చేస్తున్న జాప్యం కారణంగా మేము ఆర్థికంగా నష్టపోయామని, బ్యాంకుకు వచ్చి ఈ విషయంపై మాట్లాడిన ప్రతిసారీ పోలీసులను రప్పిస్తున్నారని దుయ్యబట్టారు. బ్యాంకులపై నమ్మకంతో డబ్బు, నగలు దాచుకుంటే జవాబుదారీగా ఉండాల్సిన మీరు పోలీసులను పిలిపిస్తారా అంటూ మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై శ్యామ్ పటేల్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.



రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మెడల్ అందుకుంటున్న ఆస్మా

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన ఆస్మా

**జన్నారం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఎండి ఆస్మా రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కూడా అద్భుతంగా రాణించి మెడల్ అందుకున్నారు. జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిఇసి చదువుతున్న ఆస్మా అండర్ 16 ఇయర్స్ 47 కేజీల విభాగం కరాటే పోటీల్లో అద్భుతంగా రాణించి థర్డ్ ప్రైజ్ మెడల్‌తో పాటు ఐదు వేల రూపాయల నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. శ్రీనివాస్, స్పోర్ట్స్ లెక్చరర్ మైస కుమారస్వామి, అధ్యాపక బృందం బాపురావు, సాయి కుమార్, రవీందర్, నాగేశ్వర్ రావు, మోహన్, దేవేందర్, శశికళ, స్వరూప, కరుణాకర్, కుమారస్వామి, శివరాం తదితరులు విద్యార్థిని ఎం డి ఆస్మాను అభినందించారు.

## పండగను శాంతియుతంగా జరుపుకోవాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:**

పండగలను మత సామరస్యంతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసమును ప్రజలు శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు. మసీదుల వద్ద ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రార్థన సమయాలలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈను ఆదేశించారు. మసీదుల వద్ద ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీస్ శాఖ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, విద్యుత్తు శాఖ ఎస్ఈ ఉత్తం జాడే, తహసిల్దార్లు రియాజ్, మధుకర్, మున్సిపల్ కమిషనర్ గజానన్, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ అహ్మద్, శాంతి కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్, సర్పంచ్

**నార్నూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో సోమవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ ముఖాడే ఉత్తంతో కలిసి సర్పంచ్ బాణోత్ కావేరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కందులకు క్వింటాకు రూ. 8000 మద్దతు ధర కల్పిస్తోందని, దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాది అలీ, మాజీ చైర్మన్ సురేష్ ఆడే, పీఏసీఎస్ ఉపసర్పంచ్ మహమ్మద్ ఖురేషి, మాజీ జెడ్పీటీసీ బిరుదులాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవరావు లోకండే, ఏఎంసీ డైరెక్టర్ జాదవ్ కైలాస్, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాథోడ్ దత్తరాం, బాలాజీ జాదవ్, సీఠ గణేష్, ఆడిటర్ సంతోష్, గుంజ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.



## విద్యుత్ ఉచ్చుకు నీలుగాయి బలి

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి 23, ప్రభాత వార్త :**



మండలంలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు నీలుగాయి బలైంది. ఈ ఘటన ఆదివారం రాత్రి వెలుగు చూసింది. సోమవారం పెంచికల్ పేట్ ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లూర్ అటవీ పరిధిలోని కోయాచిచ్చల బీట్ లో వన్యప్రాణులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు అమర్చినట్లు సమాచారం అందడంతో అటవీ సిబ్బంది గస్తీ చేపట్టారు. అటవీ ప్రాంతం గుండా వెళ్లే విద్యుత్ లైన్ లో మంటలు చెలరేగడం గమనించి అనుమానంతో రాతంత్రా గాలింపు చర్యలు కొనసాగించగా విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన నీలుగాయి కనిపించినట్లుగా తెలిపారు. సోమవారం ఉదయం పశువైద్యధికారి డాక్టర్ రాకేష్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు, అటవీ ప్రాంతంలో ఖననం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లుగా ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. నిందితులను పట్టుకొని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## సీఎం కప్‌లో పథకాలు సాధించిన క్రీడాకారుడు ధారావత్ ధనుష్

**జైపూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన ధారావత్ ధనుష్ విశిష్ట ప్రతిభ కనబరిచి రెండు పథకాలు సాధించాడు. జిల్లా స్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ధనుష్, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతూ పథకాలు గెలుచుకోవడం విశేషం. ధనుష్ తండ్రి ధరావత్ పంతులా ,జైపూర్ కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఈ అండ్ ఎం డీజీఎంగా విధులు నిర్వహిస్తూ తనయుడిని క్రీడల వైపు ప్రోత్సహించాడు. అండర్-15 సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం, అండర్-17 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అనన్యతో జతకట్టి రజత పతకం సాదుంచాడు. ధనుష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని గరుడ అకాడమీలో కోచ్ నరేందర్ రాజు మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో శిష్యుడు రెండు పతకాలు సాధించడం పట్ల కోచ్ నరేందర్ రాజు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయాలతో ధనుష్ తన కుటుంబానికి, మంచిర్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో రెండు పతకాలు సాధించడం అతని కృషి, పట్టుదల, సాధనకు నిదర్శనం. ఈ విజయం సింగరేణి కంపెనీ,సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కుటుంబ సభ్యులకు గర్వకారణంగా సింగరేణి యువతకు ఆదర్శంగా నిలిచాడు. జిల్లా ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు, స్నేహితులు ధనుష్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

## అబ్దుల్ కలాం సుసంపన్న జీవితం యువతకు ఆదర్శం

**- పరీక్షల అవగాహన-జీవిత లక్ష్యాల సాధనపై ప్రేరణాత్మక సభ**

**మందమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులకు పరీక్షల అవగాహన, జీవిత లక్ష్యాల సాధనపై మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ యువతకు ప్రేరణనిచ్చే మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏ.పి.జె. అబ్దుల్ కలాం, స్వామి వివేకానంద, సుభాష్ చంద్ర బోస్ వంటి మహోన్నతుల జీవితాలు నేటి డిజిటల్ యుగపు యువతకు మార్గదర్శకాలని పేర్కొన్నారు. ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, సేవాభావం, విజ్ఞాన సాధన ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వివరించారు. ప్రతి వ్యక్తి జీవితంలో పాఠశాల విద్య పునాదిగా నిలుస్తుందని, ఈ దశలో విద్యతో పాటు సంస్కారం, సాంకేతిక నైపుణ్యాలు, ఆకర్షణీయ వ్యక్తిత్వం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు సారా తస్నీమ్ మాట్లాడుతూ విద్యార్థులు వినయంతో చదువుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సుసంపన్న భవిష్యత్తు కోసం స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 400 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ప్రధానోపాధ్యాయులు, బోధన సిబ్బంది అతిథులను ఘనంగా సన్మానించారు.





పరీక్షల అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

# గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్ల ప్రతిపాదనలు సమర్పించాలి

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్

నస్పూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త





రాష్ట్రంలో గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీరం గల జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో గోదావరి నది తీరంలో జరగనున్న పుష్కరాల సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుద్ధం, త్రాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి చేయవలసిన ఏర్పాట్లను, సంబంధించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా జరిపేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మంచిర్యాల గోదావరి తీరంలో పుష్కర స్నానం కోసం సమీప జిల్లాల నుండి కాకుండా అనేక ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, జైపూర్ ఎసిపి లు ప్రకాష్, వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నీటిపారుదల శాఖ డి ఈ ఈ వేణుగోపాల్ రావు, ఈ ఈ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ వార్డుల పరిశుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ

### - మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



మున్సిపాలిటీలోని అన్ని వార్డుల పరిశుభ్రత కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి తెలిపారు. సోమవారం ఆమె మున్సిపాలిటీలోని 13వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కల తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి, సుందరీకరణలో లక్షెట్టిపేటను ముందు వరుసలో నిలుపుతామన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సూచనల మేరకు వార్డుల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలినర్సయ్య, వైస్ చైర్మన్ మోతుక్కూరి రాజేశ్వరి వెంకట్ స్వామి, 13వ వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ, వార్డు అధ్యక్షుడు సయ్యద్ హాజీ, నాయకులు సయ్యద్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త




మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధికి చెందిన తగరపు కేశవులు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు తగరపు గంగన్న సోమవారం బాధితుడి నివాసాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వంతు సాయంగా మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించానని, రాబోయే రోజుల్లో కూడా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంజల రమేష్, లచ్చన్న, కొత్తూరు చిన్న రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కరాటేలో మెరిసిన లత నవోదయ విద్యార్థులు

### - క్రమశిక్షణ-ఆత్మవిశ్వాసానికి కరాటేనే మార్గం: ప్రిన్సిపల్ లత నాగరాజు

మందమర్రి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని శ్రీ కృష్ణ గార్డెన్‌లో మాన్య మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో లత నవోదయ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు బహుమతులు సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ లత నాగరాజు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనతో మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకుని పాఠశాలకు కీర్తి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లత నాగరాజు మాట్లాడుతూ, పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. కరాటే వంటి యుద్ధకళలను అభ్యసించడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా మారడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



బహుమతులతో లత నవోదయ విద్యార్థులు



వార్డ్ సభ్యులకు సూచనలు చేస్తున్న ఎం.పి.డి.ఓ సత్యనారాయణ

## వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధి లో తమ వంతు పాత్ర పోషించాలి: ఎం.పి.డి.ఓ సత్య నారాయణ

జైపూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

నూతనంగా పంచాయతీలలో ఎన్నికైన వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని మండల అభివృద్ధి అధికారి గుర్రం సత్య నారాయణ అన్నారు. జైపూర్ మండలంలోని 20 గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు చట్టాలపై, పరిపాలనపై సోమవారం శిక్షణ కార్యక్రమంపై మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీల వార్డు సభ్యుల సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎం.పి.ఓ బాపు రావు పాల్గొని మాట్లాడారు..ఈనెల 22 వరకు ఐదు రోజుల పాటు మండల గ్రామాల వార్డు సభ్యులతో ఐదు రోజులపాటు గ్రామాల వార్డు సభ్యులతో శిక్షణ తరగతులను జరుపుతున్నామన్నారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ చట్టాలపై అవగాహన కల్పిస్తారు. మొత్తం 94 మంది ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.




మృతిని కుటుంబానికి బియ్యం అందజేత

## మాట తప్పని సర్పంచ్

### ఎన్నికల హామీ నెరవేరుస్తున్న సర్పంచ్ కళ్యాణి సుధాకర్

వేమనపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

సర్పంచ్ ఎన్నికల ప్రచార నిమిత్తం ఇచ్చిన హామీని నెరవేర్చారు. మండలంలోని ముల్కలపేట గ్రామపంచాయతీ సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్ గ్రామంలో చనిపోయిన ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం ఇస్తానని హామీ ఇవ్వగా ఇచ్చిన మాటకు కట్టుబడి రాచర్ల గ్రామంలోని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన కోండ్ర గున్నక్క చనిపోగా వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోర్కుటి నరేష్, పాలె కిరణ్, జిల్లపెల్లి పోశం, ముంజం సంతోష్, దున్న పవన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను భద్రత ప్రమాణాలతో సాధించాలి

జైపూర్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజువారీ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ డివిజన్ ఐకె వన్ ఏ,ఓసి అధికారులతో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ భూగర్భ గనులను కాపాడుకోవడానికి, భూగర్భ గనుల జీవితకాలం పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. 2025- 26 ఆర్థిక సంవత్సర నిర్దేశిత లక్ష్యం 2.4 లక్షల టన్నులను సాధించాలని అన్నారు.ఇందారం ఉపరితల గని నిర్దేశిత లక్ష్యం 1.5 లక్షల టన్నులు సాధించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేయాలని, ప్రతి ఒక్క కార్మికుడు నిర్దేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ వెంకటేశ్వర రెడ్డి, గని మేనేజర్లు నాగన్న, శంకర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రామకృష్ణారావు, అడిషనల్ మేనేజర్, కదాసి శ్రీనివాస్, గని రక్షణాధికారి లక్కాకుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

